క్లుప్తంగా

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

పమిడిముక్కల: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు గురు, శుక్ర, శని వారాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, పంచాయితీ రాజ్ చట్టం, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పొడిచెత్త వేరుచేయుట తదితర విషయాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు పంచాయతీ పాలనపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతామహాలక్ష్మీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మొదటిరోజు పంచాయతీలకు సంబంధించి నాలుగు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

పమిడిముక్కల: తహసీల్దార్ కార్యాలయ ఆవరణంతా పిచ్చిమొక్కలు, గడ్డితో నిండి ఉంది. తహసీల్దార్ నవీన్‌కుమార్ సూచన మేరకు వీఆర్ఏలంతా కలిసి బుధవారం ఆవరణలోని పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించారు. ఆగస్టు 15 వేడుకలు జరుపుకునేందుకు ఆవరణంతా శుభ్రం చేస్తున్నట్లు వీఆర్ఏలు తెలిపారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా సుభానీ

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి తహసీల్దార్‌గా జేవీఎస్ సుభానీ నియమితులయ్యారు. ఈ మేరకు కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కొత్త తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

ఆగమన మహోత్సవాలు ప్రారంభం

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలుమంగా పద్మావతీ సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి వార్షిక ఆగమన హహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూలవరులకు శతకలశాభిషేకం చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పమిడిముక్కల: మండలంలోని 44 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, ఒక ఎయిడెడ్, ఎనిమిది జెడ్పీ పాఠశాలలు కలిపి మొత్తం 58 పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ-2 శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 15 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 20 ఉన్నాయని పేర్కొన్నారు. 20 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను మాత్రమే ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 15 మందిని ఎన్నుకుని అందులోనుంచి ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారని పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లలో ఒకరు మహిళ ఉండాలని, ప్రతి తరగతి నుంచి ఎంపిక చేసే ముగ్గురు సభ్యులలో ఒక బీసీ, ఒక ఎస్సీ ఉండాలని తెలిపారు. మండలంలో పాఠశాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని ఎంఈఓ కోరారు.


హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కైకలూరు: ప్రతి ద్విచక్ర వాహనదారుడూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్ పేర్కొన్నారు. గోనెపాడు వద్ద పామర్రు-దిగమర్రు 165వ జాతీయ రహదారిపై వాహనాలను బుధవారం సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సులు, హెల్మెట్లు లేనివారికి జరిమానా విధించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. రూరల్ ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పెనమకూరు మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఉత్తర, దక్షిణ ఎస్సీ వాడల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ బుధవారం జరిగింది. మరీదు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శోభాశ్రీ, మరీదు యోహాను, పోతురాజు, ఏల్చూరీ నాగేంద్ర పాల్గొన్నారు.

కలిదిండి ఎంఈఓ-2గా నరేష్



కైకలూరు: ముదినేపల్లి ఎంఈఓ-2గా విధులు నిర్వహిస్తున్న కె.నరేష్‌ను కలిదిండి ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన బుధవారం ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం కలిదిండి ఎంఈఓ-2 ప్రభాకరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈఓ నరేష్ గతంలో కలిదిండి ఎంఈఓగా విధులు నిర్వర్తించారు. పలువురు ఉపాధ్యాయులు ఎంఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వరి సాగుకు నీరెలా!

పామర్రు నియోజకవర్గంలోని పలు మండలాల్లోని పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పమిడిముక్కల మండలంలోని పుల్లేరు, బందరు కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా మారింది.



మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గుర్రపుడెక్కతో నిండిన పుల్లేరు కాలువ

- కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- రైతుల ఆందోళన

పమిడిముక్కల: పుల్లేరు కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. మండల పరిధిలోని మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, గురజాడ వంతెన వద్ద కాలువలో గుర్రపుడెక్క, తూటుకాడ పేరుకుపోయింది. సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకంగా మారింది. శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరందక రైతులు నేటికీ పూర్తి స్థాయిలో నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గుర్రపుడెక్క వల్ల దుర్వాసన వస్తోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని మంటాడ, గురజాడ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్రపుడెక్కను తొలగించామని, సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేవని చెబుతున్నారు. అయితే మంటాడ, గురజాడ పరిధిలోనే కాలువంతా గుర్రపుడెక్కతో నిండి ఉంది. పుల్లేరు కాలువలోని గుర్రపుడెక్క, తూటుకాడను పూర్తి స్థాయిలో తొలగించాలని రైతులు కోరుతున్నారు.



వీరంకిలాకులో బందర్ కాలువ వద్ద నిలిచిన గుర్రపుడెక్క



గురజాడ వంతెన వద్ద గుర్రపుడెక్కతో నిండిన పుల్లేరు కాలువ

బందర్ కాలువలో..

వీరంకి లాకుల వద్ద బందర్ కాలువలోనూ గుర్రపుడెక్క నిలిచి ఉంది. ఎగువ నుంచి దిగువకు తోసేయడంతో కాలువలో పలుచోట్ల గుర్రపుడెక్క నిలిచి ఉంది. ఈ గుర్రపుడెక్క సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారంది. కాలువలోని గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి ప్రవాహానికి అడ్డంకి



సాగునీటి కాలువల్లో పలుచోట్ల గుర్రపుడెక్క, తూటుకాడ మేట వేసి ఉన్నాయి. దీనివల్ల సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దిగువకు తోసేయకుండా పూర్తి స్థాయిలో తొలగించాలి.
– బొబ్బా బాబూరావు, రైతు, అగినపర్రు

దుర్వాసన వస్తోంది



గురజాడ, మంటాడ గ్రామం పరిధిలోని పుల్లేరు కాలువంతా గుర్రపుడెక్క, తూటుకాడతో నిండి ఉంది. కొంత కాలంగా ఈ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం.
– సోలే నాగేశ్వరరావు, గురజాడ

గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టాం

పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు చర్యలు చేపట్టాం. సాగునీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. రసాయనాలు స్ప్రేచేసి పూర్తి స్థాయిలో తొలగించే పనిలో ఉన్నాం.
– కేవీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈఈ,వీరంకి సెక్షన్

కరకట్ట వెంబడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పమిడిముక్కల: నదిలోకి వరద నీరు వస్తున్నందున కరకట్ట వెంబడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని లంకపల్లి, ఐనపూరు గ్రామాల్లోని నదిలో రేవుల్లోకి వెళ్లి వరదనీటి ప్రవాహాన్ని బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. కృష్ణా బ్యారేజీ నుంచి దిగువకు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారని, నదిలో వరద ఉధృతి పెరుగుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పశువులను నదిలోకి వెళ్లకుండా చూడాలని వీఆర్వో నాగమల్లేశ్వరరావుకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు 99086 64623కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.



ఐనపూరు వద్ద నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నవీన్‌కుమార్

వరద తీవ్రత పరిశీలన

తోట్లవల్లూరు: కృష్ణానదికి వరద వస్తున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు, కరకట్ట వెంబడి గ్రామాల రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ఎస్ఐ ఎం.అర్జునరాజు, డీటీ ధనలక్ష్మి సూచించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి వరదనీటిని అధికారులు దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో స్థానిక కృష్ణానదికి బుధవారం సాయంత్రం వరద ప్రవాహం చేరుకుంది. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. తోట్లవల్లూరు ఘాట్‌తో పాటు పలు రేవులను ఎస్ఐ అర్జునరాజు, డీటీ ధనలక్ష్మి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రేవుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను రెవెన్యూ, పోలీసు సిబ్బందికి తెలియజేశారు. ఏఎస్ఐ వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, వీఆర్ఓలు నాగేశ్వరరావు, శివశంకర్ పాల్గొన్నారు.



తోట్లవల్లూరు వద్ద వరద తీవ్రతను పరిశీలిస్తున్న ఎస్ఐ అర్జునరాజు

ఆటోనగర్ అభివృద్ధికి కృషి

గుడివాడరూరల్: గుడివాడ ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆటోనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ది.కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుడివాడ ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు, కార్మికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆటోనగర్‌లోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్ ద్వారా మరింత మందికి ఉపాధిని అందించేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాముకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, యూనియన్ నాయకులు హమీద్, నాగరాజు, బాషా, ఆటోనగర్‌లోని వివిధ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాముకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దివ్యాంగుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

గుడివాడ టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని భవిత కేంద్రం (దివ్యాంగుల శిక్షణ కేంద్రం)ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు భవితకేంద్రం నిర్వహణను పరిశీలించామన్నారు. దివ్యాంగులకు అందుతున్న వసతులు, వారి విద్యావిధానం, నైపుణ్యత, ఇతర అంశాలను సమీక్షించారు. ఫిజియోథెరపిస్ట్ రేచల్ స్పందన సమక్షంలో వారి స్థితిగతులు ప్రత్యక్షంగా పరిశీలించారు. దివ్యాంగుల తల్లిదండ్రులతో జడ్జి మాట్లాడుతూ వీరిలో దాగిఉన్న నైపుణ్యాలను గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ బాబు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

గుడివాడ టౌన్: ప్రజలకు ఆహార పదార్థాలను విక్రయించే హోటళ్లలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని బుధవారం పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు హోటళ్లు తనిఖీ చేశామన్నారు. 'ఫ్రెండ్స్ వింగ్స్' హోటల్లో తనిఖీ చేసినప్పుడు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయన్నారు. పూర్తిగా కాలం చెల్లిన పదార్థాలు ఇక్కడ విక్రయిస్తున్నట్లు గమనించామన్నారు. ఇది ప్రజల ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. దీనికి తోడు సరైన ఫుడ్‌లైసెన్స్ లేకపోవడం, పదార్థాల ప్రామాణికాలు పాటించకపోవడంతో ఈ హోటల్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో పాటు అలంకార్ హోటల్ నుంచి కూడా కొన్ని శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపామన్నారు. ఫలితాలు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సుబ్బారాయుడికి వెండి విరాళం




ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు బుధవారం వెండిని విరాళంగా అందజేశారు. మండవల్లికి చెందిన కాసుకుర్తి శ్రీకాంత్, శ్రేయ దంపతులు కుమార్తె తార తరఫున 250 గ్రాముల వెండిని ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ నేల సంధ్యకు అందజేశారు. ఈ వెండిని అంతరాలయ ద్వార గుమ్మానికి తొడుగు నిమిత్తం అందజేసినట్లు దాతలు తెలిపారు. స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలతో దాతలను సహాయ కమిషనర్ సత్కరించారు.

చేనేత వస్త్రాలను కొనుగోలు చేయండి



కైకలూరు: చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు అండగా నిలవాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పేర్కొన్నారు. కాలేజీలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు ఫ్యాషన్ షో, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలలో భారతీయ సంప్రదాయం కనిపిస్తోందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయభాస్కర్, అధ్యాపకులు శ్రీనివాస్, హరిప్రసాద్, వై.జ్ఞానప్రసూనాంబ, రంగమణి, శివనాగరాజు పాల్గొన్నారు.

కాలువ పొంగి నీట మునిగిన వరిపొలం



తోట్లవల్లూరు: పుల్లేరు కాలువ పొంగి వరిపొలం నీట మునిగిన ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. స్థానిక పుల్లేరు కాలువ వారం రోజులుగా పొంగి పొర్లుతోంది. కాలువలో ఎక్కువ పరిమాణంలో నీరు విడుదల చేయటం, కాలువ గట్లు పటిష్టంగా లేకపోవటంతో సాగునీరు పొంగి పొర్లుతోంది. కాలువ కట్ట బలహీనంగా ఉన్న చోట పక్కనే ఉన్న పొలాల్లోకి నీరు పొంగి వృథాగాపోతోంది. కాలువ నీరు పొంగి పొర్లటంతో గ్రామానికి చెందిన రైతు రత్తారెడ్డికి చెందిన సుమారు అర ఎకరంపైగా వరిపొలం నీటిముంపునకు గురైంది. దీంతో బాధిత రైతు లబోదిబోమంటున్నారు. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలకు నీటి విడుదల తగ్గించి, తమ పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత

కైకలూరు: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ నాయకులు ఎంఏ రహీం, వీరాబత్తిన సుధా అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం వింజరం పంచాయతీ పద్మశాలిపేటలో నేత కార్మికులను సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంటు చేయడంతో పాటు పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోలో చెప్పిందన్నారు. నాయకులు పి.రాధాకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

తల్లిపాలే వ్యాధి నిరోధక టీకా



అయ్యవారిరుద్రవరంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ



తోట్లవల్లూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి



కొరగుంటపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

మండవల్లి: తల్లిపాలే తొలి వ్యాధి నిరోధక టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం, అప్పాపురం అంగన్‌వాడీల పరిధిలోని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. బోనం శేషగిరిరావు, ఉప సర్పంచ్ ఇంటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు చిన్ని శ్రీకృష్ణయాదవ్, వెంకట నాగలక్ష్మి, ఏఎన్ఎం చంద్రిక పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలి

మండవల్లి: పుట్టిన గంట లోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని ఎంపీహెచ్ఈఓ పీఎస్ బాబు అన్నారు. తక్కెళ్లపాడులో బుధవారం తల్లిపాల వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాబు మాట్లాడుతూ తల్లి పాల ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుందన్నారు. బిడ్డకు ఎక్కువ సార్లు పాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇవ్వకపోతే రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని తెలిపారు. ఎంపీహెచ్ఏ నాగమణి, సీహెచ్ఓ దివ్య మేరి, ఏఎన్ఎం ప్రమీలారాణి, సర్పంచ్ చేబ్రోలు మాచిలామణి పాల్గొన్నారు.

గుర్విందగుంటలో..

గుర్విందగుంట(పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లి ముర్రుపాలు రక్షణగా పని చేస్తాయని పెదపారుపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని గుర్విందగుంటలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో వారోత్సలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరమైనవని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి తెలిపారు. తోట్లవల్లూరు ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవం బుధవారం జరిగింది. ఎంఎస్‌కే శిరీష, పీహెచ్ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెంపు

గుడ్లవల్లేరు: తల్లిపాలను చిన్నారులకు పట్టడం వలన రోగ నిరోధక శక్తి వారి శరీరంలో పెంపుదల చేయవచ్చునని ఐసీడీఎస్ సీడీపీఓ విజయ ఫ్లొరెన్స్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని సూపర్‌వైజర్ వాణి ఆధ్వర్యంలో బుధవారం డోకిపర్రు, కూరాడలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సర్పంచ్ జి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.భ్రమరాంబ, నాగమణి, రమణ, ఏసుమణి, విజయలక్ష్మి, మహంకాళమ్మ, పి.రజినీరాణి, పి.జ్యోతిలక్ష్మి, డి.అనురాధ పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తేనే ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో చివరి రోజైన బుధవారం మొవ్వ మండలం పెదపూడిలోని హెల్త్ సబ్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఏఎన్ఎం బుజ్జి పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లిపాలు ఇవ్వాలని, బిడ్డకు ముర్రుపాలు సంజీవని వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మన్నే ఝాన్సీరాణి తెలిపారు. కృష్ణాపురం అంగనవాడీ కేంద్రంలో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఏఎన్ఎం సుమలత, ఎంఎల్‌హెచ్‌పీ మనీషా పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యకర జీవితం

కైకలూరు: తల్లిపాలతో ఆరోగ్యకర జీవనం బిడ్డకు అలవడుతోందని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వి.దీప్తి అన్నారు. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు కైకలూరు వెలంపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులకు తల్లపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ యూనిసెఫ్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్ఓ) సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 86.6 మంది మహిళలకు ఆస్పత్రులలో ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. వీరిలో కేవలం 41.6 శాతం మంది తల్లులు మాత్రమే బిడ్డలకు పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు అందిస్తున్నారన్నారు. శీతనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లావణ్య, షాహిదాఖానం, కృష్ణకుమారి, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, తాతారావు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



కైకలూరులో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



గుడ్లవల్లేరులో మాట్లాడుతున్న సీడీపీఓ విజయ ఫ్లొరెన్స్



పెదపూడి సబ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



కృష్ణాపురం అంగనవాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సుపర్‌వైజర్ ఝాన్సీరాణి

శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించి, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మాట్లాడుతూ స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అర్ధశతాబ్ది వార్షిక ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల కమిటీ అధ్యక్షుడు దొక్కు రాంబాబు, మాజీ అధ్యక్షుడు సీహెచ్. ఇందిరా రమణరావు, ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు పాల్గొన్నారు.



ఆండాళ్ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు